

రాజేష్ హడావిడిగా టిఫిన్ తిన్నానన్పించి చకచకా వెళ్ళిపోయాడు. అతను తినిపడేసిన ప్లేటునైపు చూసి నిట్టూర్చింది రాజేశ్వరి. ఆ నిట్టూర్పులో ఎంతో ఆవేదన, ఆరాటం, లీలగా మెదిలే నిరాశ. రెక్కలు ముక్కలు చేసుకుని వంశోద్ధారకుడి కోసం రక్తం చమటగా మార్చి, శ్రమని వెచ్చించి రూపాయలుగా తెచ్చి కొడుకు చేతులో పోసి ఎంతో ఆశతో ఫలితం ఎదురుచూసే భర్త రామనాథం గుర్తు రాగానే రాజేశ్వరి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లినాయ్.

ఒక గుమాస్తాగా తన గానుగెద్దు జీవితాన్ని ఈడుస్తూ తన ఒక్కగానొక్క కొడుకు కోసం అపార్థితలూ ఆరాటపడే రామనాథం ఆవేదన అర్థం చేసుకోలేడు రాజేష్. ఆయన ఆవేదన యిది అని చెప్పటానికి మాటల కందని భాష. తాము తిన్నా తినకపోయినా బిడ్డల భవిష్యత్ ముఖ్యంగా భావించే తల్లిదండ్రులలో రామనాథం దంపతులు ఒకరు.

రాజేష్‌కి అవేవీ పట్టవు. తనకు కావల్సినవి అమరినయ్యా లేదా? అడిగినప్పుడు కావల్సిన డబ్బు అమ్మా, నాన్న యిచ్చితీరాలి, అన్నదే అతని పాలసీ. గొప్పింటి శ్రీమంతుల బిడ్డల స్నేహాలకు అలవాటుపడిన రాజేష్ కాలేజీలో కాలర్ ఎగరేసి తిరగటం, అమ్మాయిల వెనకబడి కామెంట్ చేయటం, పిక్నిక్‌లనీ, పార్టీలనీ కాలం సద్వినియోగ పర్చటం అతనికి జీర్ణించుకుపోయిన అలవాట్లు.

రోజూ మాదిరిగానే రాజేశ్వరి కొడుకు లేచేసరికి టిఫిన్, కాఫీ తయారుచేసి పెట్టింది. శ్రీమంతుల బిడ్డల స్నేహాలేమో! తల్లి పెట్టే టిఫిన్ అంతగా రుచించలేదు. రాజేష్ తిన్నానన్పించి సగం ప్లేటు అలా వదిలేసి, కొద్దిగా సిప్‌చేసిన కాఫీ కప్పు నిర్లక్ష్యంగా పెట్టి వెళ్ళిపోతున్న కొడుకు ప్రవర్తనకి కుమిలిపోక ఏం చేస్తుందా తల్లి? తన కొడుకు "అమ్మా" అని ఆప్యాయంగా పిలిస్తే కరిగి పోవాలన్న ఆశ అడియాశ అయింది రాజేశ్వరి పట్ల. అలాస్థాణువులా ఎంతసేపు నిలబడిందో రాజేశ్వరికే తెలీలేదు. ఒక్కొక్కసారి "నేనే రాజేష్‌ని అర్థం చేసుకోలేక పోతున్నానా" అని ఆత్మ విమర్శన చేసుకునేది. కాని గజిబిజిగా వచ్చే ఆలోచనలకు ఒక రూపం అంటూ లేక పోయింది. "దొరలాగా వున్నాడు పేరుకి

తగిన కొడుకు'' అని ప్రక్కింటి పంకజం పొగుడుతూవుంటే, ఆ 'తల్లి మనసు' ఆనందంతో పరవళ్ళు తొక్కింది. కానీ... ఆత్మ సౌందర్యం కోల్పోతున్న తన బిడ్డ కోసం ఆత్మ ఘోషించింది.

తను యింటి పనులతో సతమతమౌతూ, తన బిడ్డ భవిష్యత్ బంగారు బాటలో పయనించాలన్న ఆశతో బట్టలుకుట్టి యిరుగు – పొరుగు వారికి పన్లు చేసిపెట్టి ఆర్జించిన దానితో రాజేష్‌కి ఏ లోటూ రాకుండా చేసింది. రేపు తన బిడ్డ పెద్ద ఆఫీసరైతే తాను నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చవచ్చును. ఈనాడు పడ్డ ఈ శ్రమంతా మర్చి హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చును అనుకుంది. రాజేష్ ఒక్కొక్క క్లాసు పాస్ అయి కాలేజీలో చేరిన రోజున రాజేశ్వరికి చెప్పలేని ఆనందం కల్గింది పాయసం చేసి కొడుకుచేత స్వయంగా తన చేత్తో తిన్పించింది. ఆనాడు రాజేష్ అన్న మాటలు యింకా తన చెవులలో మారు మ్రోగుతూనేవున్నాయ్. ''అమ్మా! నీలాంటి అమ్మని పొందిన నేను ఎంత అదృష్టవంతుణ్ణి'' ఆ మాటతో రాజేశ్వరికి సంతోషం అన్పించింది. అతని తలవంచి నుదుటిపై ముద్దు పెట్టుకుంది. ''బిడ్డల భవిష్యత్ బంగారు బాటలో నడవటానికి తల్లిదండ్రులు పడేశ్రమ శ్రమ అన్పించదు. ఫలానావారి బిడ్డ అని గుర్తింపు కన్నా యింకా ఏంకావాలి బాబూ?'' అన్నది రాజేశ్వరి, చెమ్మగిల్లిన తన కళ్ళను పమిటకొంగుతో తుడుచుకుని.

అటువంటి రాజేష్ కాలేజీలో చేరిన ఆరు నెలలకే తల్లి వునికి మర్చిపోయాడు. అమ్మ – నాన్న తనకి అమర్చిపెట్టే పనివాళ్ళుగా భావిస్తున్నాడు. ఇంట్లో చేసే తిండి నోటికి రుచించదు. అడిగినంత డబ్బు యివ్వని రోజున నానా గోల. ఈ రాజేష్ తన రాజేషేనా అన్న అనుమానం ఒక్కోసారి రాజేశ్వరికి రాకపోలేదు. తను కట్టుకున్న ఆశాసౌధాలు ఒక్కొక్కటిగా గాలిమేడలలాకూలిపోతున్నట్లు; పిడుగులు తనమీద పడుతున్నట్లు అనుభూతి కల్గినప్పుడు రాజేశ్వరి ఆపాదమస్తకం వణికి పోయింది. ప్రక్కింటి పంకజం పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన రాజేశ్వరి, కర్తవ్యంలో మునిగిపోయింది.

''చూడు రాజేశ్వరి! రాత్రికి మా పిల్లల బట్టలన్నీ పూర్తిచేసి యివ్వు. ఆ అన్నట్లు మరికొన్ని బట్టలు మా అమ్మాయికిచ్చి పంపిస్తాను. సమయానికి మాత్రం అందచెయ్యి, రేటు ఎక్కువ తీసుకున్నా సరే'' అంది పంకజం.

''అలాగే'' అంది రాజేశ్వరి. మిషన్ నడుపుతున్నదన్న మాటేకాని యాంత్రికంగా చేతులు పనిచేస్తున్నయి. ధన్ ధన్ మన్న శబ్దంకన్న మరీ హోరుగా ఆలోచనలు ఆమె మస్తిష్కంలో చేరి జోరీగల్లా రొద పెడ్తున్నయి.

దోషం తన రక్తంలో వున్నదా? తన పెంపకంలో వున్నదా? కాలంలో వున్నదా? తనకి అర్థం కాలేదు. తల్లి ఆవేదనతో పనిలేని రాజేష్ తిరిగి తిరిగి మత్తుగా యిల్లు చేరుకున్నాడు.

కొడుకుని ఆ స్థితిలో చూసిన ఆ తల్లి మనసు ఆక్రోసించింది. తూలుతూ తల్లిని తప్పించుకుని వెళ్తున్న కొడుకుని కన్నీటికి నోచని ఆ తల్లి కళ్ళు జీవం కోల్పోయినట్లు చూస్తుండిపోయినయ్యి. ఈ చెంపా ఆ చెంపా పగలగొట్టాలని, ఏమిటీ పని అని నిలదీయాలని అనుకుంది. తనంత ఎదిగిన కొడుకు ప్రవర్తనకి ఏమీ అనలేక అవాక్కయిపోయింది.

ఒకనాడు ఏదో మాటమీద వచ్చి ''కాలేజీలకు వెళ్ళి చదువుకోమని పంపే తల్లిదండ్రులకు, వీళ్ళు చేసే తంతు తెలీదు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టెలుకొట్టి సంపాదించి పెట్టే తండ్రులు కొందరైతే, పాచిపన్లు చేసి ఒళ్ళు హూనం చేసుకుని కడుపు కట్టుకుని బిడ్డల కోసం కూడపెట్టి చదివించే తల్లులు కొందరు. అలాంటి తల్లిదండ్రులకు తమకు రాని చదువు బిడ్డలకి రావాలని, వారు గొప్ప భవిష్యత్ పొందితే చూసి ఆనందించాలనుకునే తల్లిదండ్రులకు వీళ్ళు యిచ్చే ఫలితమిదా... అమ్మా! వాళ్ళలాగా నేను చెయ్యను. మా అమ్మని యిక కష్టపడనివ్వను. నీ శరీరానికి విశ్రాంతి ఇస్తాను. నిన్ను పూలతో పూజిస్తాను'' అన్న రాజేష్... ఈనాడు తను కళ్ళతో చూసింది నిజమా, కలా? కలత చెందిన మనసుతో కరిగిపోయిందా రోజు.

''నాకు వంద రూపాయలు అర్జంటుగా కావాలి'' అన్నాడు మర్నాడు రాజేష్.

''వంద రూపాయలా?'' రాజేశ్వరి పెదవులు అస్పష్టంగా గొణిగినాయ్.

''ఎందుకు?'' ఆప్రయత్నంగా అడిగింది.

''ఫీజు కట్టాలి'' ఆ సమాధానంలో నిర్లక్ష్యం స్పష్టపడింది.

రోజంతా ఒళ్ళు హూనం చేసుకుని కూడ బెట్టిన యాభై రూపాయలు మాత్రం తీసి యిచ్చి ''యింత కన్న నా దగ్గరలేవు'' అంది రాజేశ్వరి.

నిమురుగా ఆ డబ్బు తీసుకుని చేసిపెట్టిన టిఫిన్ వదిలేసి వెళ్తున్న కొడుకుని చూస్తూ బరువుగా నిట్టూర్చింది. అతను వెళ్ళినా అతను వాడిన ఖరీదు గల సెంటు మాత్రం రాజేశ్వరి ముక్కుపుటాలను తాకింది. ''నువ్వు పులుముకుతిరిగే ఆ సెంటు మా రక్తంబొట్లు వెచ్చించిన డబ్బుతో కొన్నదే! నువ్వు పారేసిన ఎంగిలిబతుకులు మావి! నీలాంటి స్వార్థపరుణ్ణి కన్న మేము దురదృష్టవంతులం!'' ఎన్నో అనాలని అనుకుంది కానీ పెదవి కదపలేకపోయింది. తాము కంటిపాపలా సాకింది ఈస్వార్థపరుణ్ణా? అని వాపోయింది. తన బిడ్డ డిగ్రీ చదివి ఫస్టున పాస్ అయితే ఏ అమ్మ కాళ్ళో, ఏ అయ్య కాళ్ళో పట్టుకుని ఉద్యోగం వేయించి తాము పడ్డ శ్రమంతా మర్చిపోయి, నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చుతూ, విశ్రాంతి కోసం ఆరాట పడ్డ రాజేశ్వరికి మిగిలింది ఆవేదన. తీరని ఆవేదన. బిడ్డ కష్టపడి చదువుకుంటున్నాడని ఎంతో శ్రమించి అతనికి అమర్చిపెట్టింది. కాని ఈనాడు చదువు సంస్కారం చట్టుబండలై, ఒక చదువులేని హీనుడు చేసే పని చేసాడు. విద్య విజ్ఞానాన్ని గరుపుతుందని ఎంతో ఆశపడింది. అక్కడా యిక్కడా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు అడిగి తెచ్చి కొడుకు చదువు నిరాటంకంగా సాగాలని ఆశపడింది. కానీ... కాలేజీలకు వెళ్ళి నేర్చుకునేది యిదా?

గమనిక

వ్యక్తుల పేరు మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరు పైన లేదా కార్డుపైన ఉదహరిస్తూ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520 003 అన్న చిరునామాకి పంపండి.

సం.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

1981 దీపావళి కథలపోటీ

మొత్తం రు. 5000 ల బహుమతులు

ఈసారికూడా దీపావళికి కథానికలపోటీ పెడుతున్నాము... పోయినేడాదిలాగే యీ ఏడు కూడా సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన ఐదు కథలను ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి సంచికలో, ఆ తరువాతి సంచికలో వేస్తాము. అటు తరువాత పాఠకుల బ్యాలట్ నిర్వహిస్తాము.

ముగింపు తేదీ 14-9-'81 సోమవారం

పోటీలో ఎన్నికైన ఐదు కథలకు ఒక్కొక్కదానికి రు. **600** లు చొప్పున బహుమతులు యిస్తాము. అటు తరువాత బ్యాలట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన మూడు కథలకు రు. **600**, రు. **500**, రు. **400** ల వంతున అదనపు బహుమతులు యివ్వడమే గాక మిగిలిన రెండు కథలకు రు. **250** ల చొప్పున కన్సోలేషన్ బహుమతులను అందజేస్తాము.

★ 'కథానిక' ఆంధ్ర సచిత్ర వార పత్రికలో నాలుగు పేజీలు మించకుండా వుండాలి 12 అరటాపులు దాటకుండా వాస్తే చాలు నిడివి ఎక్కువ అయిన కథలకు బహుమతి రాగల అవకాశాలు చాలా తక్కువ అని గమనించాలి.

★ కథావస్తువు తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించి వుండాలి

★ అనువాదం, అనుసరణ, అనుకరణ. కాపీ కథలు పంపకూడదు ప్రసార మైన, ప్రచురణ అయిన లేదా ఇతర పత్రికలకు పంపబడి పరిశీలనలో వున్న కథలు అసలే పంపకూడదు

★ పై అంశాలు మేరకు పోటీ పత్రం ప్రతి కథతోపాటు విడిగా వుండి తీరాలి. కలంపేరు వాడినా అసలు పేరు, యింటిపేరు సహా పూర్తిగా విడిగా స్పష్టంగా పూర్తి చిరునామాతోపాటు అందిన కథలనే పరిశీలించ వీలవుతుంది.

★ కథలతోపాటు రచయితల పేర్లు పడవు. బ్యాలట్ తరువాత వారి పరిచయం తోనే వేస్తాము

★ రచనలపై పేరీలు వస్తే రచయితలే బాధ్యత వహించవలసి వుంటుంది

★ పోటీలో నెగ్గిన కథల రచయితలు తమ ఫొటో, జీవిత విశేషాలు మొదలైనవాటిని పంపి, వాటి ప్రచురణకు అంగీకరించాలి

★ ముగింపు తేదీ దాటిన తరువాత అందిన కథలను మామూలు ప్రచురణకు వీలువెంబడి పరిశీలిస్తాము పోటీకి పంపిన కథలను ఎటి పరిస్థితులలోను తిప్పి పంపలేము

సం॥

తల్లి మనసు

దీనికోసం అంత డబ్బు తగలెయ్యనవసరం లేదు. అంత దూరం వెళ్ళి కాలేజీలో వెంగ బెట్టనవసరంలేదే! అట్లా ఎంత సేపు ఆలోచించిందో రాజేశ్వరికే తెలీదు. "రాజేశ్వరీ... రాజేశ్వరీ" అని ఆదుర్దాగా పిలుస్తున్న ఎదురింటి పార్వతమ్మ కుదిపే కుదుపుకి ఈ లోకంలోకి వచ్చింది రాజేశ్వరి.

"ఏమిటన్నట్లు చూసింది?" ఆ చూపులో విరాళ తొంగిచూసింది.

"నీ కొడుక్కి యాక్సిడెంట్ అయిందట! హాస్పిటల్‌లో చేర్చారు. ఇప్పుడే మా రవివచ్చి చెప్పాడు. త్వరగా రా" అంటున్న పార్వతిని చూస్తుండిపోయింది రాజేశ్వరి.

"ఏమిటలా వుండిపోయావ్? త్వరగా రా" అని దాదాపు లాక్కుపోయినట్లు చెయ్యిపట్టి తీసుకుపోయింది పార్వతి.

కొడుకు అచేతనంగా పడివున్నాడు. రాజేశ్వరి గుండెలు పిండినట్లయింది. మాతృ ప్రేమ పెల్లుబికి వచ్చింది. "బాబూ రాజేష్" అని గుండెలు అవిసేలా ఏడ్చింది. "చూడమ్మా! నీ కొడుక్కి రక్తం ఎక్కిస్తే కాని బ్రతకదు. ప్రస్తుతం రక్తం స్టాక్ లేదు" అన్న డాక్టర్‌ని చూస్తూ, "నా కొడుకుని ఎలాగైనా బ్రతికించండి డాక్టర్! వాడికన్నా నా ప్రాణం ఎక్కువ కాదు" అంది రాజేశ్వరి.

చకచకా పరీక్షలు జరిగిపోయినయ్యి. తన రక్తం ఒక్కొక్క బొట్టు తన శరీరం నుండి వీడి కొడుకు శరీరంలోకి ఎక్కుతోంది. మర్నాడు రాజేష్ నీరసంగా కళ్ళు తెరిచాడు. "బాబూ రాజేష్" అంది రాజేశ్వరి.

"అమ్మా" అన్నాడు రాజేష్.

"తన రక్తం ధారపోసి నిన్ను బ్రతికించుకుంది—మీ అమ్మ" అన్న డాక్టర్‌ని, కొడుకు కోసం ఆరాటపడే తల్లినీ మార్చి మార్చి చూసాడు రాజేష్.

"అమ్మా! నన్ను క్షమించగలవామ్మా" అన్నాడు, హృదయ పూర్వకంగా రాజేష్.

"కొడుకు ఎన్ని తప్పులు చేసినా తల్లి మనసు క్షమిస్తుంది రాజేష్" అన్న తండ్రి వైపు పశ్చాత్తాపంతో చూశాడు రాజేష్.

"నువ్వు నాకు దక్కావు! నాకంతే చాలు బాబూ" అంది ఆ "తల్లి మనసు". ★